## క్లుప్తంగా

### ఘనంగా సాహూ మహారాజ్ జయంతి

తిరువూరు: దేశంలో తొలిసారి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కల్పించిన బహుజన రాజ్య స్థాపకుడు ఛత్రపతి సాహూజీ మహారాజ్ 150 వ జయంతి కార్యక్రమం సోమవారం తిరువూరు బీఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వందనకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన ప్రదర్శనలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

మైలవరం: బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలని స్కూలు యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు పీ ధనలక్ష్మి తెలిపారు. మైలవరం 6వ వార్డులోని ఎంపీపీ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. చదువు–చదివించు అనే సూచనను అందరూ పాటించాలని తెలిపారు. హెచ్‌ఎం పీ గోపాల్ ముఖ్య మంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపో పరిధిలో తిరిగే ఆ సంస్థ బస్సుల్లో సమస్యలు, సేవలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలు 99592 25457 నంబర్ ద్వారా తెలియజేయాలని కోరారు.

### నివాసాల నడుమ గోవధపై ఫిర్యాదు

తిరువూరు: స్థానిక రాజుపేట కొత్త కాలనీలో నివాస గృహాల నడుమ గోవధ చేసి మాంస విక్రయాలు జరుపుతున్నారని బీజేపీ నాయకులు సోమవారం స్పందన కార్యక్రమంలో తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఇరువురు వ్యక్తులు గోమాంస విక్రయాలు జరుపుతున్న కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు గుత్తా శివ సుబ్రహ్మణ్యం, సురేష్, వెంకటరెడ్డి,రామచంద్రరావు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు.

### కౌలురైతు గుర్తింపు కార్డుతో బహుళ ప్రయోజనాలు

తిరువూరు: పొలం కౌలుకు సాగుచేసే రైతులు గుర్తింపు కార్డులు పొందితే పలు ప్రయోజనాలున్నాయని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. సోమవారం స్థానిక రాజుపేట–3 సచివాలయంలో కౌలు రైతు గుర్తింపు కార్డుల ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ శాఖ జారీ చేసే కౌలురైతు గుర్తింపు కార్డుల ద్వారా రైతుభరోసా పెట్టుబడి సాయం పొందవచ్చని, పంటల విక్రయానికి, పంట నష్టం జరిగినపుడు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను రైతు భరోసా కేంద్రాల్లో అందజేస్తే గుర్తింపు కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

### ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం

నూజివీడు: మండలంలోని గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లపల్లి, పోలసానపల్లి, రావిచర్ల, పాతరావిచర్ల, మొర్సపూడిలలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం అందజేస్తున్న తోడ్పాటుకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, నాయకులు దారావత్ శంకర్, లావు కుటుంబరావు పాల్గొన్నారు.

**రెడ్డిగూడెంలో..**
రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం రంగాపురం, మిట్టగూడెం, రాఘవాపురంలో ఇంటింటికీ బీజే పీ కార్యక్రమాన్ని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి సోమవారం ప్రారంభించారు. నాయకులు కందుకూరి నాగేశ్వరరావు, బొల్లిపోగు ప్రకాష్, లచ్చారెడ్డి పాల్గొన్నారు.

**పుల్లూరులో..**
పుల్లూరు(మైలవరం): మైలవరం మండలం పుల్లూరు, చంద్రగూడెం, కొత్తగూడెం, చిలుకూరివారిగూడెం, వెల్వడం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి మోదీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధిపై కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 1న ఆలయ భూముల కౌలు వేలం

బలివే(ముసునూరు): దక్షిణ కాశీగా వినుతికెక్కిన, చారిత్రక ప్రసిద్ధ, బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సేద్యపు భూముల కౌలు హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సోమవారం తెలిపారు. బలివే గ్రామంలో స్వామి దేవస్థానానికి చెందిన రీసర్వే నంబర్ 118లో ఉన్న 8.78 సెంట్లు వ్యవసాయ భూమిని మూడేళ్ల కాల పరిమితితో కౌలుకు పంటలు పండించుకునే నిమిత్తం ఈ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జూలై 1వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగే టెండర్ కం బహిరంగ వేలంలో డిపాజిట్ చెల్లించి, పాల్గొనవలసినదిగా కోరారు.

# రైతులకు వరం 'వైఎస్సార్ యంత్రసేవ'

- పథకం అమలులో జిల్లాలో గంపలగూడెం ప్రథమస్థానం
- వరికోత యంత్రాలు, ట్రాక్టర్ల పంపిణీ


వరికోత యంత్రం అందజేస్తున్న అధికారులు

గంపలగూడెం: వైఎస్సార్ యంత్రసేవా పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఈ పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ముందుగా వ్యవసాయశాఖ ద్వారా రైతు భరోసా కేంద్రం పరిధిలో ఐదుగురు రైతులతో ఒక క్లస్టర్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేసి, కావాల్సిన యూనిట్లు మంజూరు చేశారు. ట్రాక్టర్, వరికోత యంత్రాలను ఈ పథకంలో పంపిణీ చేశారు. ట్రాక్టర్ యూనిట్ విలువ రూ.15 లక్షలు, వరికోత యంత్రం యూనిట్ విలువ రూ.25 లక్షలు. ట్రాక్టర్ విలువలో రూ.2.5 లక్షలు, వరికోత యంత్రం విలువలో రూ.8.8 లక్షలు సబ్సిడీ. రైతులకు పెట్టుబడి భారం కాకుండా యూనిట్ విలువలో 50 శాతం బ్యాంక్ రుణం రూపంలో అందుతుంది. మిగిలిన భాగం రైతులు చెల్లించాల్సి ఉంది. గతంలో ట్రాక్టర్ లేదా వరికోత యంత్రం కొనుగోలు చేయాలంటే రైతులకు భారంగా ఉండేది. ఈ పథకం అమలుతో రైతుల గ్రూపులకు యంత్ర పరికరాలతో కూడిన ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు(హార్వెస్టర్స్) ఒనగూరుతున్నాయి. యంత్రాలతో సీహెచ్‌సీ గ్రూపుల రైతుల తమ అవసరాలను తీర్చుకొన్న పిదప ఇతర రైతుల అవసరాలకు తక్కువ ధరకు ఉపయోగపడుతున్నారు. గంపలగూడెం వ్యవసాయాధికారి బీ సాయిశ్రీ, కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్లు చంద్రశేఖర్ ఆజాద్, తెనాలి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఏసోబు, కొండయ్య ప్రత్యేక శ్రద్ధతో ఎక్కువ యూనిట్ల విడుదలకు కృషి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రెండు విడతలుగా పథకం అమల్లో ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో గంపలగూడెం మండలం ప్రథమ స్థానంలో ఉంది. జిల్లాలో 72 యూనిట్లు విడుదల కాగా 15 యూనిట్ల మండలానికి చెందినవి. వీటిలో 14 ట్రాక్టర్లు, ఒక వరికోత యంత్రం ఉన్నాయి.

**20 ట్రాక్టర్లు, నాలుగు వరికోత యంత్రాల పంపిణీ**
గంపలగూడెం మండలంలో ఇప్పటి వరకు 20 ట్రాక్టర్లు, నాలుగు వరికోత యంత్రాల పంపిణీ జరిగింది. మొదటి విడత (2022లో) ఆరు ట్రాక్టర్లు, మూడు వరికోత యంత్రాలను సీహెచ్‌సీ గ్రూపులకు పంపిణీ చేశారు. రెండో విడతలో (ఈ ఏడాది) ఇప్పటికే 14 ట్రాక్టర్లు, ఒక వరికోత యంత్రం పంపిణీ చేశారు. ఈ ఏడాది అనుముల్లంక, కొత్తపల్లి, గంపలగూడెం–1, 2, చింతలనర్వ, వినగడప, పెద్దకొమిర, ఊటుకూరు–1,2, గుళ్లపూడి, అమ్మిరెడ్డిగూడెం, నెమలి, దుందిరాలపాడు, ఆర్లపాడు రైతు భరోసా కేంద్రాల్లో సీహెచ్‌సీ గ్రూపులకు ట్రాక్టర్ యూనిట్లను పంపిణీ చేశారు. కొత్తపల్లి రైతు భరోసా కేంద్రంలో సీహెచ్‌సీ గ్రూపునకు వరికోత యంత్రం అందజేశారు. సీహెచ్‌సీ గ్రూపులకు గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ ద్వారా కావాల్సిన రుణ సౌకర్యం కల్పించారు.

**ట్రాక్టర్‌తోపాటు యంత్రపరికరాలు కూడా సరఫరా**
వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో ట్రాక్టర్‌తోపాటుగా అవసరమైన యంత్ర పరికరాలను సీహెచ్‌సీ గ్రూపులకు సమకూరాయి. ట్రక్, రోటోవేటర్, గడ్డికట్టలు కట్టే యంత్రం, ప్లవ్, రివర్స్‌బుల్‌ప్లవ్, విత్తనాలు ఎదబెట్టే సీ డ్రిల్స్, థైవాన్ స్ప్రేయర్లు అందాయి.

### రైతులకు ఎంతో ఉపయుక్తం



సబ్సిడీపై సరఫరా చేసిన వరికోత యంత్రం ఎంతో ప్రయోజనకరంగా ఉంది. యంత్రం అందుబాటులో ఉండటంతో సకాలంలో పనులు కావడంతోపాటు, ఖర్చుకూడా తగ్గుతుంది. నూతన టెక్నాలజీ యంత్రం వల్ల భూమి తడిగా ఉన్నా కూడా కోత కోసే అవకాశం ఉంది. సబ్సిడీని కూడా వెంటనే చెల్లించారు.

– జర్రిపోతుల వెంకటనారాయణ, కనుమూరు, సీహెచ్‌సీ గ్రూపు కన్వీనర్, గంపలగూడెం మండలం

### వ్యవసాయ అవసరాలు తీరుతున్నాయి



ట్రాక్టర్, యంత్ర పరికరాల వల్ల గ్రూపు రైతులకు వ్యవసాయ అవసరాలు తీరుతున్నాయి. ఖాళీ సమయాల్లో ఇతర రైతులు కూడా వినియోగించుకునేందుకు తక్కువ అద్దెకు ఇవ్వడం జరుగుతోంది.

– కందిమల్ల వీరభద్రం, గోసవీడు, సీహెచ్‌సీ గ్రూపు, గంపలగూడెం

### వనరులు సమకూరుతున్నాయి



ఈ పథకం వల్ల రైతుల వ్యవసాయానికి అవసరమైన వనరులు సమకూరుతున్నాయి. సబ్సిడీ, రుణసౌకర్యంతో రైతులకు ఆర్థికంగా కూడా భారం లేదు. గ్రూపులు చేసి ట్రాక్టర్లు, హార్వెస్టర్లు ఇవ్వడం వల్ల కచ్చితంగా ఫలితం ఉంది. రైతులు ఈ పథకాన్ని మరింతగా వినియోగించుకోవాలి

– బీ సాయిశ్రీ, వ్యవసాయాధికారి, గంపలగూడెం

### ఓబీఈ విధానంతో విద్యాప్రమాణాల పెంపు

మైలవరం: అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్(ఓబీఈ) విధానంతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరుగుతాయని, దీనిని అనుసరించాల్సిన అవసరం ఉందని జలంధర్ ఎన్ఐటీ ప్రొఫెసర్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, అసోసియేట్ డీన్, ఆర్ అండ్ డీ కన్సల్టెన్సీ డాక్టర్ తంగెళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) ఆధ్వర్యంలో అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు పాల్గొన్నారు.

### నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ ప్రాంతానికి తాగునీరు అందించే సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లో విద్యుత్ సరఫరా సమస్య తలెత్తింది. దీంతో రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచింది. స్కీమ్ నిర్వాహణకు అవసరమైన విద్యుత్ సరఫరా చేసే కేబుల్ లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సిబ్బంది నూతన కేబుల్ ఏర్పాటు చేయగా మరోసారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య తలెత్తింది. దీంతో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు సీపీడబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.

# మాదకద్రవ్యాలను ఉపయోగిస్తే కఠిన శిక్ష

ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు


నూజివీడు సబ్‌జైలులో మాట్లాడుతున్న ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

నూజివీడు: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను ఉపయోగించినా, రవాణా చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీ వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలకు వాటి వాడకం వల్ల కలిగే అనర్థాలు, చట్టప్రకారం వేసే శిక్షలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసలు కావడం వల్ల ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడంతో పాటు ఆర్థికంగా కుటుంబం కూడా అతలాకుతలం అవుతుందన్నారు. ఒక్కసారి అలవాటై అదే వ్యసనంగా మారి బానిసలవుతారని, బంగారు భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. మాదకద్రవ్యాలను రవాణా చేస్తూ, విక్రయిస్తూ పట్టుబడితే కఠిన శిక్షలు వేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి, ఏపీపీ కిషోర్ బాబు, జైలు సూపరింటెండెంట్ జీ ప్రసాద్ పాల్గొన్నారు.

**మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి**
తిరువూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ గురవయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరువూరు ఎస్ఈబీ ఎస్ఐ శివప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

**డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి**
మైలవరం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మైలవరం ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. మైలవరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని డ్రగ్స్ నిర్మూలనపై పట్టణ ప్రధాన రహదారి వెంట సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ రమేష్, సీఐ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి విక్రయించినా, సేవించినా, గంజాయి కలిగి ఉండి పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై హరిప్రసాద్, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గిరిజ సత్యకుమారి, ట్రైనీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్, ఎస్ఈబీ ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బంది, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్

**భవిష్యత్‌పై దృష్టి సారించాలి**
నూజివీడు: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు భవిష్యత్‌పై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం తెలిస్తే 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జీ అమర్‌బాబు, సెబ్ ఇన్‌స్పెక్టర్ టీ గోపాలకృష్ణ, ఏఓ ప్రదీప్, డీన్ లక్ష్మణ్, యూపీహెచ్‌సీ వైద్యురాలు సౌమ్య, పీఆర్వో సురేష్‌బాబు, పీడీ సూర్య పాల్గొన్నారు.

# 'జగనన్న సురక్ష'కు సన్నద్ధం కావాలి

చాట్రాయి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి అధికారులు సమాయత్తం కావాలని తహసీల్దార్ విశ్వనాథరావు అన్నారు. సోమవారం మండలంలోని చనుబండ సచివాయంలో జూలై నాలుగో తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం రెండు గృహాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గాప్రసాదు, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

**4 నుంచి జగనన్న సురక్ష**
మండలంలో జూలై నాలుగో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దుర్గా ప్రసాదు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఎనిమిది సచివాలయాలకు ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్, మరో ఎనిమిది సచివాలయాలకు తహసీల్దార్, ఈఓపీఆర్డీ, రెవెన్యూ అసిస్టెంట్లు కార్యక్రమాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

**తిరువూరులో ఒకటో తేదీ నుంచి ..**
తిరువూరు: మండలంలో జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో అధికారులు రెండు బృందాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

**జగనన్న సురక్షను విజయవంతం చేయాలి**
చౌటపల్లి(తిరువూరురూరల్): జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని చౌటపల్లి పంచాయతీ కార్యదర్శి ఫణిగోపాల్ కోరారు. సోమవారం చౌటపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారికి కావలసిన ధ్రువపత్రాల వివరాలను తెలుసుకోవాలని సూచించారు.

**జూపూడిలో..**
జూపూడి(ఇబ్రహీంపట్నం): జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని జూపూడి సర్పంచ్ కాకి దేవమాత కోరారు. స్థానిక సచివాలయం వద్ద మండల సచివాలయ కన్వీనర్ల కో–ఆర్డినేటర్ కోసూరు వెంకటేష్ ఆధ్వర్యంలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు జరిగిన శిక్షణలో సోమవారం ఆమె పాల్గొన్నారు.
కొండపల్లి–3వ సచివాలయం పరిధిలో జరిగిన శిక్షణలో కన్వీనర్ల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు అవగాహన కల్పించారు. జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రసన్నబోసు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ముసునూరులో..**
ముసునూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నూటికి నూరుశాతం విజయవంతం చేయాలని ఆ పథక మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండలంలోని లోపూడి గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం సర్వేను తమ తమ క్లస్టర్ల పరిధిలో వలంటీర్లు నిర్వహించే విధానంపైనే లబ్ధిదారుల అవకాశాలు ఆధారపడి ఉన్నాయని, అర్హత ఉండి పథకం అందుకోని వారిని కచ్చితంగా గుర్తించి తీరాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి మధుమోహన్, కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరాము పాల్గొన్నారు.

# 'స్పందన' అర్జీలను వెంటనే పరిష్కారించాలి


నూజివీడులో నిర్వహించిన స్పందనలో అర్జీని తీసుకుంటున్న సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్


గంపలగూడెంలో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

నూజివీడు: ప్రజలు స్పందన కార్యక్రమం ద్వారా అందించే అర్జీలను వెంటనే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు వారి అర్జీలను అందజేస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అధికారులు పనిచేయాలన్నారు. ఏదైనా సమస్య పరిష్కరించలేకపోతే అందుకు గల కారణాన్ని సంబంధిత అర్జీదారునికి తెలియజేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవన్నారు. స్పందన కార్యక్రమంలో ఎనిమిది అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఎల్పీఓ సుందరి, ఏసీడీపీఓ నాగేశ్వరి పాల్గొన్నారు.

**స్పందనలో ఎనిమిది అర్జీలు**
గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎనిమిది అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ నరసింహారావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆనందరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి పాల్గొన్నారు.

### నేడు, రేపు గడప గడపకు కార్యక్రమం

తిరువూరురూరల్: మండలంలోని జీకొత్తూరులో ఈ నెల 27, 28 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే కే రక్షణనిధి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

### మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం

వెల్వడం(మైలవరం): మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తహసీల్దారు ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. మైలవరం మండలం వెల్వడం ఎస్సీవాడలో మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆశాజ్యోతి(యూఎస్ఏ) సహకారంతో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు అందజేశారు. మిషన్ల పంపిణీకి సహకరించిన ఆశాజ్యోతి అధ్యక్షురాలు పద్మ, పాలడుగు వంశీకృష్ణ, ఉయ్యూరు పద్ద, పద్మజ ట్రస్ట్ చైర్మన్ కుడుముల వెంకట నారాయణరెడ్డికి ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ కృతజ్ఞతలు తెలిపారు.

### ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో తలెత్తిన నీటి ఎద్దడి నివారణకు మున్సిపాల్టీ అధికారులు ట్యాంకర్ల ద్వారా సోమవారం తాగునీరు సరఫరా చేశారు. గ్రామీణ తాగునీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా అక్కడి విద్యుత్ ట్రాన్స్‌ఫామ్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

### 29న దత్తసాయి పీఠంలో తొలిఏకాదశి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్య నగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 29వ తేదీ గురువారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో తొలిఏకాదశి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటలకు పంచామృత అభిషేకంతో తొలిఏకాదశి పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. స్వామికి విశేషంగా పూజలు, అభిషేకాలు వేదపండితులచే జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవీ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### 30న మహా ధర్నాను జయప్రదం చేయాలి

మైలవరం: రైతుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న విజయవాడలో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో రైతాంగానికి తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులు అందరికీ ఇన్పుట్ సబ్సిడీ, పంట బీమా వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుబ్బారావు, వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఇస్సాకు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా అందజేత

నూజివీడు: మండలంలోని జంగంగూడెంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కోటపాటి శ్రీనివాసరావు ఈ నెల 24న మృతి చెందారు. మట్టి ఖర్చుల కింద వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను నామినీ అయిన కోటపాటి రంగమ్మకు గ్రామ పెద్దలు పొట్లూరి అశోక్ చేతుల మీదుగా సోమవారం అందించారు.

### క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలి


సమావేశంలో మట్లాడుతున్న వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి

నూజివీడు: పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి అన్నారు. మండలంలోని పోతురెడ్డిపల్లి యూపీ స్కూల్‌లో సోమవారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిందన్నారు. వైస్ సర్పంచ్ అక్కినేని రాము, పాఠశాల చైర్మన్ డేవిడ్, హెచ్‌ఎం జయమణి పాల్గొన్నారు.

# అరుణాచలం వైపు ఆర్టీసీ అడుగులు

గిరి ప్రదక్షిణ రోజు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు

నూజివీడు: రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) అరుణాచలం వైపు అడుగులు వేస్తోంది. ఇటీవల నూతన ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న సంస్థ, తొలుత దూర ప్రాంత పుణ్య క్షేత్రాల వైపు దృష్టి పెట్టింది. అందులో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయ క్షేత్రమైన అరుణాచలానికి బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది. ఈ మార్గాన నడుపుతున్న బస్సులకు ప్రయాణికుల నుంచి స్పందన లభిస్తుండడంతో సేవలను విస్తరింపజేస్తోంది. ప్యాకేజీ కింద నడుపుతున్న ఈ ప్రత్యేక బస్సులో రానుపోను చార్జీలతో పాటు పలు ఆలయ క్షేత్రాల దర్శనం కూడా ఉచితంగా చేయిస్తున్నారు. ప్రతి నెలా పౌర్ణమికి బస్సులను అరుణాచలానికి నడపాలని స్థానిక ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఆదాయం ఆశించిన స్థాయిలో ఉంటే మరిన్ని సర్వీసులను పెంచే అవకాశాలున్నాయి.

**పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణకు**
అరుణాచలం క్షేత్రంలో ప్రతి నెలా పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణ దీపోత్సవం నిర్వహిస్తారు. అరుణాచలంలో శివుడిని దర్శించుకుంటే ఎంతో పుణ్యఫలం లభిస్తుందనేది భక్తుల నమ్మకం. దీంతో ఆ రోజు భక్తులు అక్కడికి ఎక్కువగా వెళ్తారని గ్రహించిన ఆర్టీసీ అధికారులు నూజివీడు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపేందుకు శ్రీకారం చుట్టారు. పౌర్ణమికి రెండు రోజుల ముందు బస్సు బయలుదేరి పౌర్ణమి రోజుకు అరుణాచలం చేరుకుంటారు. అక్కడ గిరి ప్రదక్షిణ పూర్తి చేసి, అరుణాచలేశ్వరుడిని దర్శించుకున్న తరువాత తిరుగు ప్రయాణమవుతారు. వెళ్లేటప్పుడు దారిలోనే శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌ను సందర్శిస్తారు. అక్కడ ఉచిత దర్శనాలు చేయిస్తారు. జూలై ఒకటో తేదీ సాయంత్రం అరుణాచలానికి బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు.

**ప్రత్యేక ప్యాకేజీ కింద బస్సులు**
అరుణాచల క్షేత్రం దర్శనం ప్రత్యేక ప్యాకేజీ కింద బస్సులు నడపుతున్నారు. దీనికి నూజివీడు నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి రూ.2,600 నిర్ణయించారు. ఏ ఊరిలోనైనా 36మంది ఒకేచోట ఉంటే అక్కడికే బస్సును పంపిస్తారు. ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి వచ్చే వరకు బస్సు యాత్రికులతో పాటే ఉంటుంది.

### ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్యాకేజీ బస్సులు నడుపుతున్నాం

అరుణాచలం వెళ్లే భక్తులు, యాత్రికుల కోసం ప్రత్యేక ప్యాకేజీలతో బస్సు సర్వీసును ఏర్పాటు చేశాం. జూలై ఒకటో తేదీ సాయంత్రం నూజివీడు నుంచి అరుణాచలానికి బస్సు బయలుదేరుతుంది. టికెట్లు ఆన్‌లైన్ ద్వారా, ఏజెంట్ల వద్ద ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు. 4వ తేదీకి తిరిగి బస్సు నూజివీడుకు చేరుకుంటుంది.

– సీహెచ్ ఎస్ పవన్‌కుమార్, డిపో మేనేజర్, నూజివీడు